# కొడుకులున్నారా? జాగ్రత్త

స్వర్ణ వేణుగోపాల్




గుడి మెట్లెక్కుతున్న నాకు కాస్త దూరంలో ఎటో శూన్యంలోకి చూస్తూ కూర్చున్న ఆవిడను ఎక్కడో చూసినట్లనిపించి కాస్త ఆగాను. పరీక్షగా చూద్దామనుకునేంతలో ఆవిడ తలమీది కొంగు సవరించుకోవడంతో ముఖం కనబడక, గుళ్ళోకెళ్ళానన్నమాటేగానీ..ఎవరావిడ? ఎక్కడో చూసానే..అని నా మనసు పేజీలను వెనక్కు తిప్పుతూనే ఉంది.

అన్యమనస్కంగానే దేవుడి దర్శనం చేసుకుని, కూర్చుంటుండగా సన్నగా అరిచింది నా మనసు ఆవిడెవరో తెలిసిపోయిందన్నట్లుగా. గబగబ బయటికెళ్ళి ఆవిడ ముందు నుంచుని "పార్వతమ్మ గారూ" అని పిలిచా.

ఆవిడ ఉలిక్కిపడి "ఎవరూ?" అంటూ తలెత్తి చూసి "మీరు....నువ్వు..." అంటూ తడబడుతూంటే-

"నేనమ్మా మూర్తిని" అంటూ నన్ను నేను పరిచయం చేసుకున్నా.

"నువ్వా మూర్తీ..బాగున్నావా?" ఆమె గొంతులో నీరసం స్పష్టంగా పలికింది.

"బాగున్నానమ్మా! మీరేంటీ ..ఇక్కడ.. ఇలా.." నా గొంతులో బాధ.

"అంతా నా ఖర్మ నాయనా!" కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా అన్నారావిడ.

"ముందు మీరు లేవండి. మనింటికి వెళ్ళి అన్నీ మాట్లాడుకోవచ్చు" అని బలవంతంగా ఆమెను ఇంటికి తీసుకువచ్చా.

ఆవిడ పరిస్థితికి శారద కూడా చాలా బాధపడింది. "ముందు మీరు స్నానం చేసి, భోంచేసి రెస్టు తీసుకోండి. అన్ని విషయాలూ సాయంత్రం మాట్లాడుకోవచ్చు" అని ఆవిడకన్నీ అమర్చిపెట్టింది.

ఆవిడ తీరు చూస్తే తృప్తిగా తిని ఎన్నో రోజులయినట్లుగా అనిపించి మనసు కలుక్కుమంది. ఒకప్పుడు ఎంతోమంది ఆకలితీర్చిన ఆ చేయినే చాచి అడుక్కోవడం ఎంత దారుణం. తెలియకుండానే నా కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి.

భోజనం చేసి నిశ్చింతగా, హాయిగా, పసిపాపలా నిద్రపోతున్న ఆవిడను చూసి ఇద్దరం తెగ బాధపడిపోయాము.

సుందరంగారు ఆఫీసులో మా బాస్. పార్వతమ్మగారు ఆయన భార్య. ఇద్దరూ పార్వతీపరమేశ్వరుల్లా ఉండేవారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా మేమున్నామంటూ ముందుకొచ్చేవారు. ఆఫీసులో కూడా స్టాఫునందరినీ తన కుటుంబసభ్యుల్లా చూసేవారు. ఆదరించేవారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా ఆయన సలహా తీసుకునేవాళ్ళం.

వాళ్ళకు ఒక్కడే కొడుకు. దీపక్. సార్ లేరని ఆవిడను చూడగానే అర్థమయిపోయింది. మరి దీపక్ ఏమయ్యాడు? గుడి దగ్గర కూర్చునేంత పరిస్థితి ఎందుకొచ్చింది? పిచ్చిపిచ్చి ఆలోచనలతో నా బుర్ర వేడెక్కిపోయింది.

"మీరూ కాస్సేపు నిద్రపోరాదా? ఆవిడ లేచాక అన్నీ చెబుతారు కదా? ఎందుకనవసరంగా ఆలోచించి మీరు బాధపడ్డం?" అంది శారద.

శారదకేం తెలుసు? తను ఎన్నో విధాలుగా వాళ్ళ సాయం తీసుకున్నానని? ఉద్యోగం పోయేంత క్లిష్టపరిస్థితిలో..ఆయన ఆదుకున్నారు. ఆర్థికంగా కూడా ఎన్నోసార్లు సాయం చేసారు. వాళ్ళింటికి ఎప్పుడు వెళ్ళినా కడుపునింపకుండా పంపేవారు కారు పార్వతమ్మగారు. తను ఇల్లు కట్టుకోవడానికిగానీ, సంపత్ ఇంజనీరు కావడానికిగానీ వారి అండే లేకపోతే జరిగేది కాదు. అందుకే ఆవిడ పరిస్థితికి తల్లడిల్లిపోతున్నాను.

సాయంత్రం టీలయ్యాక ఇక ఆగలేక "దీపక్ ఎక్కడున్నాడమ్మా?" అడిగా.

"హైదరాబాద్‌లోనే ఉన్నాడు మూర్తీ. వాడికి ఇద్దరు పిల్లలు"

"మరి మీరెందుకిక్కడ..ఇలా..." ఎలా అడగాలో తెలియక ఆగిపోయా.

"మీ సారు రిటైరయిపోయాక వాడు రమ్మంటున్నాడని ఇల్లూ, స్థలాలూ అమ్మేసి వెళ్ళిపోయాము కదా? కొన్నాళ్ళు బాగానే ఉన్నాము. ఎందుకో వాడిలో స్వార్థం మొదలయింది. ఇక్కడ ఇల్లు కొనాలనీ..పిల్లల పేర్లమీద ప్లాట్లు కొనాలన్న ఆశ మొదలయింది. మెలమెల్లగా మీ సారు దగ్గరున్న డబ్బంతా తీసుకున్నాడు. మాకూ ఉన్నది వాడొక్కడేకదా ఉండేదంతా వాడికే కదా అనుకుని వాడడిగింది కాదనక ఉన్న డబ్బంతా ఇచ్చేసాము. సార్‌కు జబ్బు చేస్తే, చేతిలో పైసా లేదు. వాడు విసుక్కోవడం మొదలుపెట్టాడు. చివరకు ఉస్మానియాలో వదిలేసాడు. వచ్చి చూసేవాడు కాదు. చివరికాలంలో నానా ఇబ్బందీ పడ్డారు మీ సారు. మానసికంగా కృంగిపోయారు. ఆయన బాధ చూడలేక త్వరగా ప్రాణం పోతే బాగుండుననుకునేదాన్ని. పగవారికి కూడా ఆ పరిస్థితి రాకూడదు మూర్తీ. సాయంత్రం ప్రాణం పోతే రాత్రంతా ఇంట్లో ఉంచితే, పిల్లలు భయపడ్తారంటూ వాడు వెళ్ళిపోతే, ఇంత కసాయివాడు తలకొరివి పెట్టినా, ఆయన ఆత్మ శాంతించదని నేనే ఆయన బాడీని మెడికల్ కాలేజీకి అప్పగించి, ఆ కఠినాత్ముడి దగ్గర ఉండలేక ఇలా వచ్చేసాను" మధ్యలో మధ్యలో కళ్ళు తుడుచుకుంటూ, దుఃఖంతో గొంతు పూడుకుపోతుంటే చెప్పలేక, చెప్పలేక ఆవిడ చెప్పిన దారుణాతి దారుణమైన నిజం మా ఇద్దరినీ బాధతో విలవిలలాడేలా చేసింది. శారదయితే, భోరుమని ఏడ్చేసింది. పార్వతమ్మగారే ఓదార్చాల్సి వచ్చింది తనని.

"మేమంతా ఉండగా మీరు బాధపడాల్సిన అవసరం లేదు. మీరూ మాతోనే నిశ్చింతగా ఉండచ్చు. అన్నీ మర్చిపోండి" అంటూ అన్ని విధాలా ఓదార్చి ధైర్యం చెప్పాం.

కానీ..కర్మకాండలేవీ చేయకపోయినా, మిగిలిన కార్యక్రమాలు ఏవీ చేయనందుకు వేదన చెందుతున్న ఆవిడకు నచ్చచెప్పి, అన్నీ సక్రమంగా జరిపించా. సారు పేరుమీద వందమంది పేదవారికి అన్నం పెట్టి, బట్టలు పంచాం. సారు సాయంపొందిన, మంచితనం తెలిసిన మా ఆఫీసు స్టాఫ్ అందరూ వచ్చి తలా ఒక చేయి వేసి, మేమందరం ఉన్నామంటూ పార్వతమ్మగారికి ధైర్యం చెప్పి వెళ్ళారు.

అందరినీ పేరు పేరునా పలుకరించి, కృతజ్ఞ

తలు చెప్తూ కళ్ళనీళ్ళు పెట్టుకున్న ఆవిడను చూసి అందరం చలించి పోయాం. ఎలాగైనా ఆ కొడుకుని పట్టుకుని, నాలుగు దులిపి ఆమెకు న్యాయం చేయాలన్న నిర్ణయానికొచ్చామందరం.

మాతోనే ఉండిపొమ్మని ఎంత చెప్పినా వినకపోవడంతో, పార్వతమ్మగారిని అన్ని సదుపాయాలూ ఉన్న హోమ్‌లో చేర్పించి, అప్పుడప్పుడూ వెళ్ళి చూసి వచ్చేవాళ్ళం.

ఆవిడ వెళ్ళేముందు "మూర్తీ! నీవూ ఇంకో ఆరు నెలల్లో రిటైరవుతానంటున్నావు. నీకూ కొడుకున్నాడు. జాగ్రత్త. మాలాగా మోసపోకండి. అనుబంధాలూ, అనురాగాలూ, ప్రేమ కావాలి కానీ, డబ్బు ముఖ్యమా? అని లేని పోని సినిమా మాటలు అనుకుంటాము కానీ నిజ జీవితంలో అందునా ఈ వయసులో మనిషికి అండాదండా అందించేది డబ్బే. ఇదే చేదు నిజం. ఇద్దరిలో ఒకరు ముందు ఒకరు వెనుక వెళ్ళిపోక తప్పదు. వినడానికి కష్టంగా ఉన్నా వాస్తవాన్ని ఒప్పుకోక తప్పదు. ఒంటరితనమే కాదు, అన్నింటికీ ఇంకొకరిపై (పిల్లలు) ఆధారపడి బ్రతకడం నరకం. అందుకే ఏ ఆస్తి అయినా, డబ్బయినా మన తదనంతరమే పిల్లలకు చెందేలా జాగ్రత్తపడాలి. అందరూ దీపక్‌లా ఉంటారని నేను అనను. ఎంతో మనం జాగ్రత్తగా ఉండడంలో తప్పులేదు కదా? మాలా చాలామంది బాధపడుతున్నారు. అదేం మాయోగానీ 'పిల్లలు' అన్న పాశం మనిషిని కట్టిపడేస్తోంది. ఇలా చెబుతున్నందుకు సంపత్‌ను అనుమానిస్తున్నందుకు వేరేలా అనుకోకు మూర్తీ! నాకు చెప్పాలనిపించి చెప్పానంతే. మనసు కష్టపెడితే మర్చిపో" అన్నారు.

ఆవిడ వెళ్ళేముందు బలవంతంగా దీపక్ అడ్రసు తీసుకున్నా.

మా వాడూ హైదరాబాదులోనే ఉండడంతో, నేనూ, శారద అక్కడికి వెళ్ళాం. మావాడు ఉండే ఇంటికి దగ్గరలోనే దీపక్ ఉండే అపార్టుమెంటు ఉండడంతో రెండుమూడుసార్లు అటువైపు వెళ్ళాను.

డైరెక్టుగా వెళ్ళకుండా అనుకోకుండా కలిసినట్లుగా ఉండాలన్న నా ప్లాను సక్సెస్ అయింది ఒకరోజు.

దీపక్ పక్కనున్న సూపర్ మార్కెట్‌లోకి వెళ్ళడం చూసి నేనూ వెళ్ళా. వాడున్న వైపే వెళ్ళి..అప్పుడే చూసినట్లుగా "అరె..నీవు సుందరం సార్‌గారి అబ్బాయివి కదూ" అన్నా.

ఆ మాటకు వాడు నావైపు చూసి "అవును మీరూ.." అంటూ ఒక్కక్షణం ఆగి, "మూర్తి అంకుల్" అన్నాడు.


'ఫరవాలేదు గుర్తున్నాను వెధవకి' అనుకున్నా మనసులో.

"బాగానే గుర్తుపట్టావే" భుజం తడ్తూ అన్నా పైకి.

"భలేవారే అంకుల్. చిన్నప్పటినుండి చూసిన మిమ్మల్ని ఎలా మర్చిపోగలననుకున్నారు?" అన్నాడు.

"అది సరే..అమ్మ..నాన్న ఎలా





ఉన్నారు?" అడిగా.

"లేరంకుల్" బాధగా మొహం పెట్టి అన్నాడు వెంటనే.

"ఇల్లుపక్కనే అంకుల్. రండి అక్కడ మాట్లాడుకుందాం" అని ఇంటికి తీసుకెళ్ళాడు.

నాక్కావలసింది అదే కదా! అందుకే మారు మాట్లాడకుండా వెళ్ళా.

హాల్లో కడుగుపెట్టగానే అదిరిపడ్డా. ఎదురుగా సుందరం సార్, పార్వతమ్మగారి ఫోటోలు రెండింటికీ దండ వేసుంది. రాస్కెల్. తల్లి బ్రతికుండగానే దండవేసేసాడు. ఇంతకన్నా అమానుషం వుంటుందా ప్రపంచంలో? నా రక్తం కుతకుత ఉడికిపోయింది. వాడి చెంప ఛెళ్ళుమనిపించాలనిపించింది. ఎంతో కంట్రోలు చేసుకున్నా.

మూడో అంతస్థులో ఉన్నాడు. మూడు బెడ్‌రూముల డూప్లెక్స్ ఫ్లాట్ అందంగా వుంది. ఇదంతా సార్ సంపాదన. తల్లిని రోడ్డుపాలు చేసి హాయిగా అనుభవిస్తున్నాడు వెధవ. నా మనసు నా మాట వినడం లేదు. ఏం చేయను?

భార్యా పిల్లలను పరిచయం చేసాడు. అందరూ బాగున్నారు.

"నాన్నగారు పుణ్యాత్ములు. అందరికీ ఎంతో సాయం చేసేవారు. ఇప్పటికీ ఆఫీసులో అందరం తలుచుకుంటూనే ఉంటాము. ఇంతకీ ఎలా పోయారు దీపక్?" అడిగా.

"హార్ట్ ఎటాక్..అంకుల్! ఆయన పోయాక, తట్టుకోలేక అమ్మ కూడా.." నాన్చాడు.

ఇక భార్య అందుకుంది. "మేమయితే తల్లీ, కూతుళ్ళలా ఉండేవాళ్ళమంది. అత్త, కోడళ్ళమంటే ఎవ్వరూ నమ్మేవారు కాదు. ఇంటి విషయాలన్నీ ఆవిడే చూసుకునేవారు. ఆవిడపోయాక మాకు పెద్ద దిక్కు లేకుండా పోయింది" భర్తకు వత్తాసు పలుకుతూ..రాని కన్నీళ్ళను తుడుచుకుంది.

ఇక నేనూరుకోలేకపోయా..


"అయ్యో! ఎందుకమ్మా బాధపడ్తారు? మీ అత్తగారు, మీ పెద్దదిక్కుని నేను తీసుకొస్తాగా? అసలు మీరింతగా బాధపడ్తున్నారని తెలిస్తే నాతోనే తీసుకొచ్చేవాడిని కదా?" అనగానే ఇద్దరూ అవాక్కయి ఒకరిమొహాలొకరు చూసుకుని మౌనంగా వుండిపోయారు.

ఇక నేనే "అయినా దీపక్! ఇదేం పనయ్యా! తల్లి, తండ్రి దైవసమానులు. వారి పట్ల ఇంత అమానుషంగా ఎలా ప్రవర్తించావు? బ్రతికున్న తల్లి ఫోటోకు దండ వేస్తావా? అసలు నీవు మనిషివేనా? మంచికి మారుపేరైన వారి కడుపున నీలాటి నీచుడెలా పుట్టాడసలు? నిన్ను అరచేతిలో పెంచుకున్నారే? అందుకా ఇంత ద్రోహం చేస్తున్నావు? నిన్ను నవమాసాలు మోసిన కన్నతల్లిని రోడ్లమీద అడుక్కునే పరిస్థితికి తీసుకువస్తావా? చనిపోయిన తండ్రిని ఇంటికి తీసుకురాకుండా, చేయవలసిన విధులు చేయకుండా అనాథగా హాస్పిటల్‌లో వదిలేస్తావా? నీకు కొంచెం కూడా మానవత్వం లేదా? రేపు నీ కొడుకు కూడా ఇలాగే చేస్తే..చేస్తే ఏంటి తప్పకుండా చేస్తాడు. బతికుండగానే మిమ్మల్ని తగులబెట్టేస్తాడు. చూస్తూండు" ఆవేశంతో నా గొంతు వణికిపోతోంది. నా అరుపులకు పక్క ఇళ్ళవాళ్ళు తొంగి చూసి పోతున్నారు.

అది చూసి దీపక్..గబుక్కున లేచి వెళ్ళి తలుపు వేసేసాడు.

"ప్లీజ్..అంకుల్ మెల్లిగా మాట్లాడండి" అందరూ వింటున్నారు. బతిమాలినట్లుగా చెప్పాడు.

నాకర్ధమయిపోయింది. మధ్యతరగతి మనిషికి ఏం



## తెలివైన లక్ష్మీరాయ్

**క**న్నడ భామ లక్ష్మీరాయ్ నటించిన ఒకే ఒక్క తెలుగు చిత్రం 'కాంచనమాల కేబుల్ టీవీ' పరాజయం పాలైంది. తమిళ, మలయాళం, కన్నడ చిత్రాల్లో ఒకటి రెండు నటించిన లక్ష్మీరాయ్‌కి ధోనితో దోస్తీ విషయమై పబ్లిసిటీ బాగానే వచ్చింది. ధోనికి వేరే అమ్మాయితో పెళ్ళయిపోయింది కాబట్టి- లక్ష్మీరాయ్‌ని ఈ విషయమై ఇక ఎవరూ ఏమీ అడగరు. అదలా వుంటే తాజాగా ఆమెకి తమిళ హీరో అజిత్‌తో హీరోయిన్‌గా నటించే చాన్సు వచ్చింది. దీంతో ఆనందంతో ఉక్కిరి బిక్కిరవుతోంది లక్ష్మీరాయ్. 'నాకు నా మాతృభాష కన్నడం అనే లేదు, ఏ భాషలో నటించినా ఎంతో ఆనందంగా వుంటుంది' అంటుంది లక్ష్మీరాయ్.

లేకపోయినా పరువు కోసం పాకులాడతాడు. వీడూ అదే బాపతు. ఈ వీక్‌నెస్ నాకు ప్లస్ పాయింటే. అందుకే రెచ్చిపోయా.

"వినవే దీపక్! అందరూ మొహాన ఉమ్మేస్తే తెలుస్తుంది" కచ్చగా అన్నా.

"అయినా ఇది మా ఇంటి విషయం. మీరెవరండీ అడగడానికి? ఏదైనా మేమూ..మేమూ చూసుకుంటాం" రోషంగా అంది దీపక్ భార్య.

"చూడమ్మా! మీది రక్తసంబంధమయితే..మాది మానసిక అనుబంధం. కన్నతల్లిని రోడ్డుమీద వదిలేసి, చనిపోయిందని దండవేసి, నలుగురినీ నమ్మిస్తున్న మానవ మృగాలను నేనే కాదు, దారినపోయే ఏ దానయ్యయినా కాలర్ పట్టుకుని అడుగుతాడు. అడగచ్చు కూడా. ఎక్కువగా మాట్లాడితే. ఏ మీడియాకో ఉప్పందించాననుకో. నిముషాల మీద వాలిపోయి మీపై ఇరవై నాలుగ్గంటలూ రసవత్తరంగా దేశమంతటా కథలు వినిపిస్తారు. అలాంటిదేమైనా జరగాలనుకుంటున్నావా? చెప్పు.." కావాలనే బెదిరించా.

"అబ్బ! మధూ..నీవు నోర్మూసుకో" అని భార్యను కసిరి

"అంకుల్ మీ కాళ్ళు పట్టుకుంటాను. నా పరువు తీయకండి. ఇక్కడ నేనే ప్రెసిడెంటుని. నలుగురికీ మంచి మాటలు చెప్పే నేనంటే ఇక్కడందరికీ అభిమానం, గౌరవం. దయచేసి నా ఇమేజిని, డ్యామేజి చేయద్దు. అమ్మ, నాన్న విషయంలో నేను చేసింది చాలా పెద్ద తప్పే. ఇప్పుడు నేనేం చేయాలో చెప్పండి. చేస్తా"

"ఆవిడ..ఎవ్వరూ లేని అనాథలా హోమ్‌లో ఉన్నారు. ఆవిడ జీవనానికి నీవు ఏర్పాటు చేయి. ఓ పాతిక లక్షలు ఆవిడ పేరుమీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయి. దాంతో...ఆవిడున్నంత వరకు ఏ లోటూ లేకుండా గడిచిపోతుంది" చెప్పా.

"పాతిక లక్షలే..అదేం కుదరదు. ఆవిడను ఇక్కడికే వచ్చి ఉండమనండి..చూసుకుంటాం" అంది దీపక్ భార్య.

"మరి! దండవేసి చనిపోయిందని చెప్పుకున్న మీ నీచ, నికృష్ట, బుద్ధి అందరికీ తెలిసిపోతుందే ఆవిడ వస్తే..ఫరవాలేదామ్మా!" వ్యంగ్యంగా అన్నా.

"నిన్ను నోర్మూసుకోమన్నానా?" గట్టిగా అరిచాడు భార్యపై దీపక్.

"సరే..అంకుల్ మీరు చెప్పినట్లుగానే చేస్తాను" ఒప్పుకున్నాడు.

"అయినా! సారు మీకిచ్చిన దాంట్లో ఇదేపాటి? ఈ ఫ్లాటు కూడా సారు పేరు మీదే ఉందని, కింద లిస్టు చూస్తే తెలిసిపోయింది. మీరేమైనా తోక జాడించారో..ఈ ఇల్లు ఖాళీ చేసి అమ్మకు అప్పజెప్పాల్సి వస్తుంది జాగ్రత్త"

"ఆమె గురించి ఆలోచించే కన్నకొడుకు లేకపోయినా, ఆమె చేతిముద్ద తిన్నవాళ్ళం యాభైమంది కొడుకులం మేమున్నాం అది తెలుసుకోండి. రేపు మా ఆఫీసు నుండి నలుగురు వస్తున్నారు. అందరూ నీకు తెలిసినవారే. వాళ్ళు పెట్టే గడ్డి కూడా కాస్త తిని..అందరి సమక్షంలో పాతిక లక్షలు డిపాజిట్ చేసి ఇవ్వు" తీవ్రమైన కంఠంతో హెచ్చరించి వచ్చేసా.

తన పేరు మీదున్న పాతిక లక్షలు చూసి, దైన్యంగా ఉన్న ఆమె కళ్ళు ధైర్యంతో, సంతోషంతో మెరిసాయి. "మీ మేలు మర్చిపోలేను. దానిపై వచ్చే వడ్డీయే నాకు ఎక్కువ. నా తరువాత ఈ పాతిక లక్షలు ఈ హోమ్‌కే చెందేలా రాసేస్తా" అన్నారామె.

"మీరందరూ బాగుండాలి" అంటూ తడికళ్ళతో దీవించిన ఆమె దీవెనలందుకుని, కొడుకులతో జాగ్రత్తగా ఉండాలని ఒకరినొకరు హెచ్చరించుకుని ఇళ్ళకు వచ్చేసాము.

అడుగడుగునా సార్ సాయమందుకొని ఎంతో ఋణపడిపోయిన నేను, ఈవిధంగా ఒక అవగింజంత ఋణాన్ని తీర్చుకున్నందుకు తృప్తిగా, హాయిగా నిద్రపోయా.

○

## రోజువారీ గిట్టుబాటు

*సినిమాకి ఇంత అనే కన్నా రోజుకి ఇంత అని సొమ్ము అందుకోడానికి ఇష్టపడే తారలు ఎక్కువవుతున్నారు. ఇలాగైతే ఎక్కువగా గిట్టుబాటవుతుందనేది వాళ్ల ఆశ. యాడ్స్ చేసేటప్పుడు కూడా ఇదే నిబంధన పాటిస్తున్నవాళ్లూ వున్నారు. మిల్కీ వైట్ భామ తమన్నా కూడా ఇలాగే ఇప్పుడు తను యాడ్స్ చేయాలంటే రోజుకి పాతిక లక్షలు డిమాండ్ చేస్తోందిట. ఇలా చేయడం వల్ల ఎక్కువ యాడ్స్ వచ్చి బోల్డంత సంపాదించవచ్చనేది ఆమె ఆలోచనట. మరి ఆ లెక్కతో ఆమెకెన్ని యాడ్స్ వస్తాయో!*

